జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 17 | జూన్ | 2026 ◆ పేజీలు : 7

## ప్రజలకు సత్వర సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 15, (ప్రజాజ్యోతి) :** ప్రజలకు సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు, ఐ డి ఓ సి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, సమస్యల పరిష్కారానికి అధికారులు

మిగతా 2 లో...



## సిద్ధమైన పొలాలు... ముఖం చాటేసిన వర్షాలు!

- తొలి వానల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాతలు
- దుక్కులు దున్ని, విత్తనాలు సిద్ధం చేసినా ముందుకు సాగని సాగు
- ఆలస్యమవుతున్న నైరుతి రుతుపవనాలతో రైతుల్లో పెరుగుతున్న ఆందోళన
- భద్రాద్రి జిల్లాలో వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ప్రభావం

7 లో..

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

"రైతు కళ్లలో ఆశ... ఆకాశంలో మేఘాల కోసం ఎదురుచూపు" అన్న పరిస్థితి ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కనిపిస్తోంది. వానాకాలం ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగుకు సిద్ధమైన పొలాలు వర్షపు చినుకుల కోసం ఎదురు చూస్తుండగా, రైతుల ఆశలు మాత్రం ఆకాశానికే పరిమితమవుతున్నాయి.

## పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిపై ఆర్‌టీఐ అస్త్రం

● అవినీతి ఆరోపణల నడుమ ఆర్‌టీఐ దరఖాస్తు కలకలం



**పాల్వంచ, జూన్ 15, ప్రజాజ్యోతి:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిపైనే ఇప్పుడు అనుమానాల మేఘాలు కమ్ముకున్నాయి. పేదలకు పెద్ద దిక్కుగా నిలవాల్సిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి ఇటీవల వరుస వివాదాలు, అవినీతి ఆరోపణలు, రోగుల ఫిర్యాదులతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఆసుపత్రిలో నిజంగా ఏం జరుగుతోంది..? ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా..? లేక కాగితాలకే పరిమితమవుతున్నాయా..? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా

మిగతా 2 లో...

## అభివృద్ధే నా ఎజెండా

● ఎమ్మెల్యే పాయం



**పినపాక, జూన్ 15 (ప్రజాజ్యోతి)** ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఆ తర్వాత ప్రజల అభివృద్ధి, సంక్షేమమే

మిగతా 2 లో...

- భట్టి జన్మదిన వేడుకల్లో భగ్గుమన్న కాంగ్రెస్ వర్గ విభేదాలు
- మరోసారి బహిర్గతమైన అంతర్గత విభేదాలు
- కలిసి నడుస్తారా...విడివిడిగానే సాగుతారా...
- భద్రాచలం–వాజేడు రహదారికి రూ.48 కోట్ల నిధులు మంజూరు
- ఎంపీ బలరాం నాయక్

## ఒకే పార్టీ.. రెండు వేదికలు..

**చర్ల, జూన్ 15 (ప్రజాజ్యోతి):** చర్ల మండల కాంగ్రెస్ పార్టీలో చాలాకాలంగా కొనసాగుతున్న వర్గ విభేదాలు మరోసారి బహిరంగ వేదికపై భగ్గుమన్నాయి. మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామకం సందర్భంగా మొదలైన అంతర్గత పోరు రోజురోజుకూ ముదురుతూ వస్తుండగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఆ విభేదాలకు మరోసారి అద్దం పట్టాయి. ఒకే పార్టీకి చెందిన నాయకులు ఒకే నాయకుడి జన్మదిన వేడుకలను రెండు వేదికలపై, రెండు వర్గాలుగా విడిపోయి నిర్వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండల స్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావాల్సిన సమయంలో నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు కార్యకర్తలను ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎవరి వర్గం వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తుండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు మార్కెట్ కమిటీ చైర్మన్





మిగతా 2 లో...

## అభివృద్ధే నా ఎజెండా



(మొదటి పేజీ తరువాయి...)

తన ఎజెండా అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్‌రోడ్డు జీవీఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో 30 మందికి కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు, 23 మందికి రూ.10 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో జెండాలు చూడొద్దని, అర్హతే ప్రామాణికమని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పక్షపాతం, డబ్బుల వసూళ్లు జరిగితే సొంత పార్టీ వారినైనా ఉపేక్షించబోనని హెచ్చరించారు. లబ్ధిదారులకు అన్యాయం జరిగితే నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేయాలని సూచించారు. చింతలబయ్యారం శైవక్షేత్రంలో గోదావరి పుష్కరాల కోసం పుష్కర ఘాట్, వ్యవసాయ భూముల కోసం లిఫ్ట్ ఏర్పాటుకు అనుమతులు కోరామని ఎమ్మెల్యే తెలిపారు.

### • సీతంపేటలో రూ.16 లక్షల సీసీ రోడ్లకు శంకుస్థాపన

సీతంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ.16 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన చేశారు. అలాగే రూ.2.5 లక్షలతో పునర్నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సంకీర్త్, ఎంపీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం, గ్రామపంచాయతీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు

## ప్రజలకు సత్వర సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేక దృష్టి సారించాలని. ప్రజల సమస్యలను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. అన్ని శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

**ప్రజావాణిలో అందిన కొన్ని వినతులు**

టేకులపల్లి మండలం మొక్కంపాడు తండాకు చెందిన భూక్య సుమన్ తాను జన్మతః దివ్యాంగుడినని, అద్దె ఇంటిలో నివసిస్తూ జీవనం సాగించడం కష్టతరంగా మారిందని, ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల కోసం గృహ నిర్మాణ శాఖ పీడీకి ఎండార్స్ చేశారు. మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన బట్ట కృష్ణవేణి తన కుమార్తె దివ్యశ్రీ ఆరో తరగతి ప్రవేశం కోసం గురుకుల ప్రవేశ పరీక్ష రాసినప్పటికీ సీటు రాలేదని, తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్థోమత లేదని పేర్కొంటూ గురుకుల పాఠశాలలో సీటు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. దీనిపై తగు చర్యల కోసం ఆర్‌సీఓ, సోషల్ వెల్ఫేర్‌కు ఎండార్స్ చేశారు. సుజాతనగర్ మండలం చిమ్న తండా గ్రామానికి చెందిన భూక్య సేవ తన తండ్రి 2010లో మరణించారని, మరణ ధ్రువీకరణ పత్రం కోసం పలుమార్లు మీ సేవలో దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరణకు గురవుతోందని తెలిపారు. ఈ కారణంగా తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరుపై మార్చుకోలేకపోతున్నానని, సమస్య పరిష్కరించి మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం సుజాతనగర్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన స్వప్న తనకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, పూర్తిగా వర్షాధార సాగుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నానని, బోరు ,విద్యుత్ సదుపాయం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తదుపరి చర్యల కోసం ఐటీడీఏ పీవోకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ధనియాలపాడు గ్రామ పరిధిలోని బాలాజీ తండాకు చెందిన భానోత్ అనూష తనకు సంబంధించిన రెండు వేర్వేరు భూముల భూభారతి రిజిస్ట్రేషన్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం సంబంధిత ధరణి అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిపై ఆర్‌టీఐ అస్త్రం

(మొదటి పేజీ తరువాయి...)

తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో బసవతారక కాలనీకి చెందిన సామాజిక కార్యకర్త కొడుపుగంటి శ్రీనివాస్ (100 రోజులు శ్రీను) సమాచార హక్కు చట్టం–2005 కింద దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తు ఆసుపత్రి వర్గాల్లోనే కాకుండా ప్రజల్లో కూడా ఆసక్తి రేకెత్తిస్తోంది. పాల్వంచ మండలం బసవతారక కాలనీకి చెందిన కొడుపుగంటి శ్రీనివాస్ (100 రోజుల శ్రీను) సమాచార హక్కు చట్టం–2005 కింద ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమాచారాన్ని కోరారు. ప్రజలకు అందాల్సిన వైద్య సేవల విషయంలో పారదర్శకత ఎంత మేర ఉందో తెలుసుకునేందుకు ఈ దరఖాస్తు దోహదపడుతుందని స్థానికులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆసుపత్రిలో మెడికల్ సర్టిఫికెట్ల జారీ విషయంలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది మధ్యవర్తుల ద్వారా వేల రూపాయలు వసూలు చేసి, రోగిని ప్రత్యక్షంగా పరీక్షించకుండానే మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. అంతే కాకుండా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, సమయపాలన లోపం, రోగుల పట్ల కొంతమంది సిబ్బంది దురుసు ప్రవర్తన వంటి అంశాలపై కూడా పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొడుపుగంటి శ్రీనివాస్(100 రోజుల శ్రీను) దాఖలు చేసిన ఆర్‌ట ీఐలో ఆసుపత్రికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆసుపత్రిలో ప్రస్తుతం ఎన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయో, ఎన్ని రకాల శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారో, ఆసుపత్రి పడకల సామర్థ్యం ఎంత ఉందో వివరాలు ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సంఖ్య, వారి ప్రత్యేక విభాగాలు, సిబ్బంది పని వేళలు, వైద్య సిబ్బందితో పాటు ఇతర ఉద్యోగులు మరియు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలను పేర్లతో సహా అందించాలని దరఖాస్తులో పేర్కొన్నారు. ఇన్‌పేషెంట్లకు అందిస్తున్న సౌకర్యాలు, శస్త్రచికిత్స అనంతరం రోగులకు అందించే భోజనం, కూరల వివరాలు, రోగ నిర్ధారణ కోసం అందుబాటులో ఉన్న పరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్ సేవల సంఖ్య వంటి అంశాలపై కూడా సమాచారం కోరారు. అదే విధంగా ప్రభుత్వంచే ఆసుపత్రికి సరఫరా అవుతున్న మందుల జాబితా, వాటి వివరాలను కూడా వెల్లడించాలని అభ్యర్థించారు.

### ››› పారదర్శకతకు పరీక్షగా ఆర్‌టీఐ

ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రధాన ఆధారం. అలాంటి సంస్థలపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి ఆర్‌టీఐ ఒక ప్రజాస్వామ్య సాధనంగా నిలుస్తుంది. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిపై దాఖలైన ఈ దరఖాస్తు ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### ››› ప్రజల్లో ఆసక్తి

ఆసుపత్రిలో అందుతున్న సేవల నాణ్యత, సిబ్బంది పనితీరు, ప్రభుత్వ నిధుల వినియోగం వంటి అంశాలపై ఇప్పటికే ప్రజల్లో అనేక సందేహాలు ఉన్న నేపథ్యంలో, ఈ ఆర్‌టీఐకి అధికారులు ఇచ్చే సమాధానాలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. సమగ్ర సమాచారం బయటకు వస్తే ఆసుపత్రి పనితీరుపై స్పష్టత రావడంతో పాటు, అవసరమైతే లోపాల సవరణకు కూడా మార్గం సుగమం అవుతుందని స్థానికులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాల్వంచలో ఈ ఆర్‌టీఐ దరఖాస్తు హాటట ాపికగా మారగా, ఆసుపత్రి యంత్రాంగం ఎలాంటి సమాచారం అందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిపై నేను దాఖలు చేసిన ఆర్ టీఐ ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని కాదు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై పారదర్శకత తీసుకురావాలనే ఉద్దేశంతోనే సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరడం జరిగింది. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయా లేదా అనేది తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉంది. అదే హక్కుతో నేను ఆర్ టీఐ దాఖలు చేశాను. నేను కోరిన సమాచారాన్ని అధికారులు పూర్తిస్థాయిలో అందిస్తారని ఆశిస్తున్నాను. ఆర్ టీఐ ద్వారా వచ్చే సమాధానాలను ప్రజల ముందుంచి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేస్తాను.



కొడుపుగంటి శ్రీనివాస్ (100 రోజులు శ్రీను)

## ఒకే పార్టీ.. రెండు వేదికలు...

(మొదటి పేజీ తరువాయి...)

ఏర్పా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ, జవ్వాది రవి కుమార్,స సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణ, అర్జున రావు, ఆత్మ కమిటీ చైర్మన్ బుచ్చిబాబు, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల సర్పంచ్ లు హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు బండారు రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజాసేవకు అంకితభావంతో రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. "పీపుల్స్ మార్చ్ పాదయాత్ర" ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన భట్టి విక్రమార్క ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ చేయాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఇదిలా ఉండగా, మరోవైపు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి కృష్ణ , టీపీసీసీ కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, లంక రాజు, బ్రహ్మానంద రెడ్డి తదితర నాయకులతో పాటు సుమారు 200 మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. తొలి దశలో వేలాది ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదల గృహ కలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర అభివృద్ధి ఆర్థిక నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్ ఫోన్ ద్వారా నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. భట్టి విక్రమార్క జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ భద్రాచలం ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ముఖ్యంగా భద్రాచలం–వాజేడు ప్రధాన రహదారి అభివృద్ధి పనుల కోసం రూ.48 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నిధులతో రహదారి అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని భద్రాచలం నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భద్రాచలం ప్రాంత అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చివరగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజాసేవలో ఆయన మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంపీ బలరాం నాయక్ సందేశాన్ని కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలకు వినిపించారు. అయితే ఈ రెండు వేర్వేరు కార్యక్రమాలకు హాజరైన నాయకులు కార్యకర్తల సంఖ్యను బట్టి ఒకే పార్టీకి చెందిన నాయకులు ఒకే రోజు, ఒకే నాయకుడి జన్మదినాన్ని వేర్వేరు వేదికలపై నిర్వహించడం ద్వారా మండల కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టమవుతున్నాయి.గత కొంతకాలంగా మండల కాంగ్రెస్‌లో నాయకత్వ ఆధిపత్యంపై వివాదాలు కొనసాగుతున్నప్పటికీ పార్టీ పెద్దల జోక్యంతో అవి సద్దుమణిగినట్లు కనిపించాయి. అయితే భట్టి విక్రమార్క జన్మదిన వేడుకల సందర్భంగా జరిగిన పరిణామాలు చూస్తే విభేదాలు ఇంకా కొనసాగుతున్నాయనే విషయం స్పష్టమైంది. పైకి పార్టీ ఐక్యత గురించి మాట్లాడుతున్న నాయకులు క్షేత్రస్థాయిలో మాత్రం వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించడం కార్యకర్తల్లోనూ గందరగోళానికి కారణమవుతోంది అని ఒకే జెండా కింద పనిచేయాల్సిన నాయకులు వేర్వేరు వేదికలపై కార్యక్రమాలు నిర్వహించడం పార్టీ శ్రేణులకు ఏమాత్రం శుభసూచకం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. చర్ల కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఈ అంతర్గత కుమ్ములాటలకు పార్టీ అధిష్టానం ఎప్పుడు చెక్ పెడుతుంది? రాబోయే ఎన్నికల నాటికి ఇరు వర్గాలు ఐక్యంగా పనిచేస్తాయా? లేక విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చుతాయా? అనే ప్రశ్నలు ప్రస్తుతం మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలి

- సాటివారిగూడెం రైతుల ఆవేదన.. కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- ప్రభుత్వ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులు నిలిచిపోయాయని ఆవేదన
- అధికారులు జోక్యం చేసుకుని పనులు పూర్తి చేయించాలని వినతి



**లక్ష్మీదేవిపల్లి, జూన్ 15 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, లక్ష్మీదేవిపల్లి మండలంలోని సాటివారిగూడెం గ్రామంలో ప్రజా ప్రయోజనాల కోసం మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని గ్రామ రైతులు, గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో బాధిత రైతులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని ఆర్&బీ రోడ్డు నుండి శ్రీకాంత్ నివాసం వరకు ఉన్న మట్టి రహదారిపై గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు లభించి పనులు ప్రారంభమైనట్లు వారు తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు వివిధ కారణాలు చూపుతూ పనులను అడ్డుకోవడంతో నిర్మాణం నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి ద్వారా గ్రామంలోని రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లడంతో పాటు పలువురు కుటుంబాలు నిత్య రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షాకాలంలో బురద, గుంతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్ప అభివృద్ధి జరగడం లేదని వాపోయారు. కొంతమంది వ్యక్తిగత డిమాండ్లను ముందుకు తెచ్చి పనులను అడ్డుకోవడం సమంజసం కాదని రైతులు అభిప్రాయపడ్డారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంజూరైన రహదారిని పూర్తిచేయడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని కోరారు. ప్రజా అవసరాలకు సంబంధించిన అభివృద్ధి పనులు వివాదాల కారణంగా నిలిచిపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యాలు కూడా దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించాలని సంబంధిత శాఖల అధికారులతో సమన్వ యం చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని రైతులు కలెక్టర్‌ను కోరా రు. గ్రామ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రై తులు తెలిపారు. గ్రామాభివృద్ధికి కీలకమైన ఈ రహదారి పనులు త్వరగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బోడు గ్రామంలో భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



**టేకులపల్లి,జూన్ 15, ప్రజాజ్యోతి:** బోడు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పోదేం స్వరూప–సుధీర్, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భట్టి విక్రమార్క ప్రజాసేవలో విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యా లతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి ఖాదర్ బాబు,మొక్కంపాడు సర్పంచ్ బానోత్ సురేష్, భూక్య సైదులు, సామినేని సత్యనారాయణ,రేఖ రామచంద్ర, కుంజ సాంబయ్య, మాసిపాక రామస్వామి, అన్నారపు రవి, ఈసాల రవీందర్, సూరే వీరస్వామి, బాలాజీ నాయక్, మురికి సత్యనారాయణ, మురికి శంకర్, ఈర్ప వెంకటేష్, మహమ్మద్ మున్నా, మాడే అంజమ్మ, చిలువేరు చంద్రశేఖర్, మాసిపాక అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- - టీయూసీఐ



**పినపాక,జూన్ 15(ప్రజా జ్యోతి)** గ్రామపంచాయతీ కార్మికులకు జీవో నెం.6 లేదా జీవో నెం.60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పినపాక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఎంపీడీవో సంకీర్త్, ఎంపీవో శ్రీనివాస రావు లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని కోరారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి జీవో నెం.6 ప్రకారం పెంచిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యలను తమ పరిధిలో వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో, ఎంపీవో హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## పాము కాటు బాధితుడి పరామర్శ



**చర్ల, జూన్ 15 (ప్రజాజ్యోతి):** చర్ల మండలం జీపీపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పూసం రాజా పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న చర్ల–నూగూరు–వెంకటాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.పూసం రాజా ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న ఆయన, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.ఏర్పా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం తమకు ముఖ్యమని కష్టకాలంలో వారికి అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మచ్చ రాజా , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సెక్రటరీని కలిసిన బీఆర్ఎస్ నేతలు



**చర్ల, జూన్ 15 :(ప్రజాజ్యోతి):** చర్ల మేజర్ గ్రామపంచాయతీకి నూతనంగా బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి రాంబాబును సోమవారం చర్ల బీఆర్ఎస్ మండల కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలను శుభ్రం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలోని పలు రహదారులు దెబ్బతిన్నాయని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు అధ్వాన్నంగా మారడంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పాత చర్ల గాంధీ బొమ్మ సెంటర్ నుంచి రైస్‌పేట వరకు రాత్రింబవళ్లు రహదారులపై పశువులు సంచరిస్తూ, పడుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.చర్ల గ్రామపంచాయతీ అభివృద్ధికి తమ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు, పండు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సైకిల్ పై సవారీ

- ఇల్లందులో మెయిన్ రోడ్డుపై చక్కర్లు



**ఇల్లందు, జూన్ 15 (ప్రజా జ్యోతి):** సాధారణంగా ఎమ్మెల్యే అంటే హంగు... ఆ ర్భాటం... మంది మార్బలం ఉండడం సహజమే. కానీ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాత్రం అలాంటి వాటికి దూరంగా ఉంటూ సామాన్య వ్యక్తులాగా ప్రజల మధ్య తిరుగుతున్నాడు. సోమవారం ఇల్లందు పట్టణంలోని మెయిన్ రో డ్డులో సైకిల్ పై సవారి చేశారు. ప్రజల సమస్యలను సైకిల్ పై తిరుగుతూ తెలుసుకున్నారు. దింతో ప్రజలందరూ ఎమ్మెల్యే సింప్లిసిటీని అభినందిస్తున్నారు.

## విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ



**బూర్గంపహాడ్, జూన్ 15 (ప్రజా జ్యోతి ):** మండల కేంద్రమైన బూర్గంపహాడ్ పరిధిలోని బత్తులనగర్ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సపావత్ బాలకృష్ణ చౌహాన్, ఉపాధ్యాయులు భాస్కర్ చేతులమీదుగా సోమవారం ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో పాటు నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు మంచిగా విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కృష్ణసాగర్ పంచాయతీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- -ఎంపీవో రామకృష్ణ



**బూర్గంపహాడ్, జూన్ 15 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీలో ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీవో రామకృష్ణ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన పంచాయతీ పనుల రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పంచాయతీ అభివృద్ధికి అవసరమైన వివరాలు సర్పంచ్ తాటి వాణి, ఉపసర్పంచ్ భూక్యా మోహన్రావులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని, కార్యదర్శులు పంచాయతీలో వీధిలైట్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం తదితర వాటిపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్లు ఎంపీవోను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగిరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాల




**చర్ల, జూన్ 15 :(ప్రజాజ్యోతి):**వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం కావడంతో ఎం.పి.పి.ఎస్. చిన్నమిడిసిలేరు పాఠశాలలో సందడి నెలకొంది. కొత్త విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి, చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సందర్భగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఎస్ రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరాన్ని లక్ష్యాలతో ప్రారంభించి ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ పాఠశాలల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. రజని, కె. చంద్రకళ, పి. వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, పరిశుభ్రత, సమయపాలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువులో ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రారంభమైన తొలి రోజే 20 మంది విద్యార్థులు హాజరై ఉత్సాహంగా తరగతుల్లో పాల్గొన్నారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉపాధ్యాయులు కూడా పూర్తి స్థాయిలో హాజరై విద్యా బోధన కార్యక్రమాలను ప్రారంభించారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు సహకరించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నేను మోదుగులకుంటను... నన్ను గాలికి వదిలేశారు





**గుండాల. జూన్ 15 ప్రజా జ్యోతి** నా పేరు మోదుగులకుంట అని ఏనాడో నాకు నామకరణం చేశారు ఆనాడు నుండి కొంతకాలం పాటు నా కడుపులో దాగి ఉన్న నీటిని పశువులకు పక్షులకు నా కింద పొలాలకు అందించాను. ఆనాటి నుండి నా నుండి వచ్చిన నీటితో వందలాది ఎకరాల ను పంటలు పండించుకున్నారు. నాలో దాగి ఉన్న మీరు ఇంకి భూగర్భ జలాల ద్వారా గుండాల గ్రామానికి బావల ద్వారా బోర్ల ద్వారా నీరు అందించాను కానీ నేడు నన్ను గాలికి వదిలేశారు నన్ను శుభ్రం చేయాల్సింది పోయి నా కడుపులోకి మట్టిపోస్తూ నన్ను పూడ్చేందుకు ముందుకు వస్తున్నారు నా నుండి మట్టి తీయాల్సింది పోయి ,నాపై మట్టి పోస్తూ నన్ను పూర్తిగా తొలగించాలని చూస్తున్నట్లు కనిపిస్తుంది. నేను నాలాంటి చెరువులను కాపాడుకుంటేనే భూగర్భ జలాలు ఉంటాయి, మమ్ములను తొలగించినట్లయితే భూగర్భ జలాలతోపాటు పశువులు, వివిధ రకాల జంతువులు, అనేక రకాల పక్షులు, అనేక రకాల పురుగులు పాములు బ్రతకడానికి మీరు సేవించడానికి కష్టంగా మారుతుంది. నాకు కొద్ది దూరంలోనే నన్ను కాపాడే రెవెన్యూ శాఖ కార్యాలయం ఉంది. అధికారులారా ఆలోచించండి నన్ను కాపాడండి

# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు




**కొత్తగూడెం, జూన్ 15 ( ప్రజాజ్యోతి )** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జన్మదిన వేడుకలను సోమవారం కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జేబీ శౌరి మాట్లాడుతూ భట్టి విక్రమార్క ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని పేర్కొన్నారు.ప్రజాసేవ,క్రమశిక్షణ,నిరాడంబర జీవనశైలితో యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతుకూరి ధర్మారావు, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ ఏలూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి. రజాక్, నగర కాంగ్రెస్ కన్వీనర్ ఎండి గౌస్ మోహినుద్దీన్, ఓబీసీ జిల్లా చైర్మన్ అల్లాడి నరసింహారావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్, సోషల్ మీడియా ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జ్ వీరాపురం రామ్ లక్ష్మణ్, సేవాలాల్ నియోజకవర్గ అధ్యక్షుడు పోరేటి నరేష్, మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఆరిఫ్ ఖాన్, యువజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షుడు ఉస్మాన్ అలీ ఖాన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు లాల్ సింగ్, ఏలూరి రాందాస్, గాండ్ల సురేష్, పెగడ బిక్షపతి, కొమరయ్య, నరసింహారావు, నిరంజన్ రెడ్డి, వాగబోయిన రాము, యువజన నాయకులు నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## 22 తర్వాత ఎప్పుడైనా

- ఏఐటీయూసీ హెచ్చరిక



**కొత్తగూడెం, జూన్ 15 ( ప్రజాజ్యోతి )**సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు. సోమవారం పీవీకే–5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పులు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు, ఇంటి స్థలాల కేటాయింపు, డిపెండెంట్ ఉద్యోగాల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించడం ఏఐటీయూసీ పోరాట ఫలితమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త గనుల ప్రారంభం, సంస్థ విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం వైఖరి మారకపోతే ఆందోళనలను ఉధృతం చేసి నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షులు, కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్యతో పాటు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట వెల్లడి

**భద్రాచలం టౌన్, జూన్ 15, ప్రజాజ్యోతి,** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ అధికారుల సమక్షంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ దరఖాస్తుదారులు కోరిన విధంగా అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలతో పాటు రెవెన్యూకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు తీసుకోవాలన్నారు. డివిజన్ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు సంబంధిత అధికారులు వారి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు వారికి సంబంధించిన వివిధ సమస్యల గురించి నేరుగా ప్రజావాణిలో విన్నవించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దారు తోట రవికుమార్, డీఎల్‌పీవో సుధీర్, డీఏవో భగవాన్ రెడ్డి, ఆర్ అండ్ బి డి ఈ సతీష్ భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.




## శిలాఫలకంలో 19వ డివిజన్ కార్పొరేటర్ పేరు పెట్టాలి



**కొత్తగూడెం, జూన్ 15 ( ప్రజాజ్యోతి )**రామవరం ఏజెన్సీ ప్రాంత గిరిజనుల ఆత్మగౌరవాన్ని అవమానపరచొద్దని నల్లకుంట చెరువు అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకంలో 19వ డివిజన్ కార్పొరేటర్ పేరును పొందుపరచాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గోబ్రియా నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ మధు, సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. నల్లకుంట చెరువు 19వ డివిజన్ పరిధిలో ఉండగా, ఆ ప్రాంతానికి సంబంధంలేని 16వ డివిజన్ కార్పొరేటర్ పేరును శిలాఫలకంలో ఉంచడం గిరిజనులను అవమానపరచడమేనని ఆయన అన్నారు. నల్లకుంట, ఎర్రకుంట చెరువులపై చిట్టిరామవరం తండా గిరిజన రైతులకు సర్వహక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా స్థానిక రైతులను భాగస్వాములను చేస్తూ 19వ డివిజన్ గిరిజన కార్పొరేటర్ పేరును శిలాఫలకంలో చేర్చాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో లచ్చిరాం, బోడ కృష్ణ, కల్లూరి కుమార్, వష్య నాయక్, మూడు రమేష్, పూర్ణ, మనోజ్, శ్రీనివాస్ నాయక్, వేణు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత



**భద్రాచలం టౌన్, జూన్ 15 ప్రజాజ్యోతి,** భద్రాచలం నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె ఈ మేరకు మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.సొంతింటి కల నెరవేర్చుకునే క్రమంలో పేదలు అప్పులు చేసి మరీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారని, అయితే, ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ అప్పులకు వడ్డీలు కట్టలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లత పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బిల్లులను సకాలంలో విడుదల చేసి ఉంటే, నేడు పేదలు ఇంతలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారు కాదని ఆమె అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం ఇకనైనా చిత్తశుద్ధితో వ్యవహరించి, పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణ బిల్లులను పూర్తిస్థాయిలో విడుదల చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని ఆమె కోరారు. లేనిపక్షంలో, మహాజన మహిళా సమైక్య ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# నేటి నుండి జరిగే టెట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 15,(ప్రజా జ్యోతి)** నేటి నుండిజిల్లాలో నిర్వహించనున్న టీజీ టెట్ జూన్–2026 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుండి ఈనెల 22 వరకు మొత్తం ఐదు రోజుల పాటు పది సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు ,జిల్లాలో మొత్తం 1,217 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం పాల్వంచలోని అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, ఇంటర్నెట్ , తాగు నీరు, భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రానికి చేరుకుని హాల్ టికెట్‌తో పాటు సంబంధిత గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షా నిబంధనలను తప్పనిసరిగా పాటించి విజయవంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు.

## గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలి

- **భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్**



**భద్రాచలం టౌన్ , జూన్ 15 ప్రజాజ్యోతి** సుదూర ఆదివాసి గిరిజన గ్రామాల నుండి గిరిజన దర్బార్ లో దరఖాస్తులు చేసుకొన్న గిరిజనులకు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా యూనిట్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలన్నారు. అర్జీలలో పోడు భూముల పట్టాలలో పేర్లు మార్పు కొరకు, రైతుబంధు రుణాల కొరకు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు, బోరు, మోటారు కొరకు, మారుమూల గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు దరఖాస్తులందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఏటీడీవో పీసా అధికారి అశోక్, ఏవో సున్నం రాంబాబు, కొండరెడ్ల అధికారి గన్యా, ఏపీఓ పవర్ వేణు, ఏ డి ఎమ్ హెచ్ ఓ సైదులు, హౌసింగ్ ఏఈ హేమంత్, జేడీఎం హరికృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ డీఈ రవితేజ పాల్గొన్నారు.

## పోడు సాగుదారులకు న్యాయం చేయాలి

- **జంగిలి వెంకటరత్నం**



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 15 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని జానకీపురం గ్రామానికి చెందిన పోడు సాగుదారులకు వెంటనే పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అన్నపురెడ్డిపల్లి తహశీల్దార్ స్వర్ణకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని జానకీపురం గ్రామానికి చెందిన పలువురు పేద బీసీ రైతులు, ముఖ్యం గా ముతరాశి, యాదవ సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు గత 15 సంవత్సరాలుగా పోడు భూముల్లో వివిధ రకాల పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 2012లో అధికారులు సర్వే నిర్వహించి సంబంధిత సర్వే పత్రాలు అందజేసినప్పటికీ, ఇప్పటివరకు పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పట్టాలు లేకపోవడంతో సాగుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి పోడు భూములకు పట్టాలు మంజూరు చేసి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.లింగానబోయిన వెంకటేశ్వర్లు, నూనె కోటయ్య, కొమరబోయిన కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య



**భద్రాచలం టౌన్ , జూన్ 15 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు.

## సెల్ టవర్ అనుమతులు రద్దు చేయాలి

- **నివాస సముదాయం మధ్య నిర్మించ తలపెట్టిన సెల్ టవర్ తో పొంచి ఉన్న ప్రమాదం**
- **జిల్లా కలెక్టర్ కి బాపూజీనగర్ వాసుల విజ్ఞప్తి**



**పాల్వంచ, జూన్ 15, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని బాపూజీనగర్ నివాస సముదాయం మధ్య నిర్మించ తలపెట్టిన సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులను వెంటనే రద్దు చేసి, పనులను నిలిపివేయాలని స్థానిక నివాసులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.బాపూజీనగర్ రెండో లైన్‌లో హౌస్ నంబర్ 20-6-92 ఇంటి పైభాగంలో జీ ప్లస్ టూ భవనంపై ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని నివాసులు పేర్కొన్నారు. ఈ విషయమై స్థానికులు ఇంటి యజమానిని ప్రశ్నించగా, తాను సెల్ టవర్ నిర్మించడం లేదని, సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నానని చెప్పినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం జీ ప్లస్ టూ నిర్మాణంపై టవర్ ఏర్పాటుకు అనుకూలంగా అదనపు నిర్మాణ పనులు పూర్తిచేసినట్లు ఆరోపించారు.సదరు ఇంటి స్థలం సుమారు 66 అడుగుల పొడవు, 22 అడుగుల వెడల్పు మాత్రమే ఉండగా, చుట్టూ దట్టమైన నివాస సముదాయం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావంతో ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని తెలిపారు.అందువల్ల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, సెల్ టవర్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయడంతో పాటు నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని బాపూజీనగర్ నివాసులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## అరసం కవి త్రయానికి ఘన సన్మానం



**కొత్తగూడెం, జూన్ 15 ( ప్రజాజ్యోతి )** ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో పాల్గొని కవితా పఠనంతో ప్రశంసలు అందుకున్న రామవరం ప్రాంతానికి చెందిన అభ్యుదయ కవులు తూముల శ్రీనివాస్, సయ్యద్ అబ్దుల్ నజీర్, మహమ్మద్ ముస్తఫాలకు సోమవారం రామవరం జానీమియా టెంట్ హౌస్ ప్రాంగణంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మర్రి గోపికృష్ణ, మహమ్మద్ అంకుష్ మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు కవులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కవిత్వం సమాజ మార్పుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. రామవరం ప్రాంతానికి చెందిన ఈ ముగ్గురు కవులను కవి త్రయం గా అభివర్ణించారు. సన్మాన గ్రహీత తూముల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు భాషాభివృద్ధికి దోహదపడుతున్నాయని నేటి తరం పిల్లల్లో తెలుగు భాషపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కవులు సయ్యద్ అబ్దుల్ నజీర్, మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనడం తమకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, సామాజిక చైతన్యానికి కవిత్వాన్ని అంకితం చేస్తామని తెలిపారు. అజ్మీరా బాలాజీ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని సీతారాములు, మట్టి కొండయ్య సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ ఐసీ మామిడిశెట్టి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ గుగులోతు నగేష్, ఉపసర్పంచ్ సింగిరాల రమేష్, మాజీ గణేష్ టెంపుల్ డైరెక్టర్ పోలంపల్లి సురేందర్, యువజన నాయకులు బరిగల భూపేష్, కూరగాయల శ్రీనివాస్, రాజేష్, ప్రముఖ వ్యాపారవేత్త జాకీర్ హుస్సేన్, ప్రేమ్ కుమార్, సముద్రం, కెసీఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని కవులను సన్మానించారు.

## రేషన్ షాపుల ద్వారా ఉచితంగా నిత్యవసర సరుకులు అందించాలి

- **ఐద్వా పట్టణ కార్యదర్శి డి. సీత లక్ష్మి**




**భద్రాచలం టౌన్ , జూన్ 15 ప్రజాజ్యోతి** పేదలందరికీ ఉచితంగా 14 రకాల నిత్యవసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా అందించాలని ఐద్వా భద్రాచలం పట్టణ కార్యదర్శి డిసీతలక్ష్మి డిమాండ్ చేశారు. రోజు రోజుకి పెరిగిపోతున్న నిత్యవసర వస్తువుల ధరలపై భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి మాట్లాడుతూ పచ్చిమాస్యాలో నెలకొన్న విద్య పరిస్థితులను సాకుగా చూపించి పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు అమాంతం పెంచేశారని అన్నారు. ఆ ప్రభావంతో అన్ని రకాల నిత్యవసర వస్తువులపై పడి ధరలు ఆకాశానికి అంటుతున్నాయని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రజల ఆదాయం పెరగటం లేదని అన్నారు. వేతనాలు పెరగక నిత్యాసరా వస్తువులు తో సహా కూరగాయల ధరలు సైతం మండిపోవడంతో పేదవాడి పూట గడవటం కష్టంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పేదలను ఉద్ధరిస్తున్నామని ఊక దంపుడు ఉపన్యాసాలు చెప్పే మోదీ సర్కార్ తన 12 ఏళ్ల పదవీకాలంలో ప్రతి వస్తువుపై 1200 సార్లు ధరలు పెంచారని ఆరోపించారు. రాష్ట్ర పాలకులు సైతం కేంద్ర బాటలను ఉపయోగిస్తూ పేదోల ఆర్థిక పరిస్థితులను గాలికి వదిలేసి సంక్షేమం పేపర్లకే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పేదలకు 12 రకాల నిత్యవసర వస్తువులు ఉచితంగా రేషన్ షాపుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వాజ్ సీనియర్ నాయకురాలు నాదెండ్ల లీలావతి జీవనజ్యోతి ఎం సుబ్బలక్ష్మి ఉస్తేల జ్యోతి పూర్ణ సీత తదితరులు పాల్గొన్నారు

## విద్య, వైద్యం రంగాలకు సీఎస్ఆర్ నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 15,(ప్రజాజ్యోతి)** జిల్లాలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ తదితర పరిశ్రమల ప్రతినిధులతో సీఎస్ఆర్ నిధుల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన కొత్త పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పాఠశాలల్లో తరగతి గదుల అభివృద్ధి, ఫర్నిచర్, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వసతులు, డిజిటల్ విద్యా సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలకు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని కోరారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతులు, రోగుల సౌకర్యాల కల్పనకు పరిశ్రమలు సహకరించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు అవసరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందుతున్న వినతులు, ఫిర్యాదులు, స్థానిక అవసరాల ఆధారంగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే పనులను ఎంపిక చేసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ వేగవంతంగా అమలు చేయాలని చెప్పారు.అదేవిధంగాగిరిజన, గుత్తికోయ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన కలెక్టర్, జిల్లాలోని అన్ని పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. సీఎస్ఆర్ నిధుల వినియోగం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని అన్నారు.సమావేశంలో పరిశ్రమల ప్రతినిధులు తమ సంస్థల ద్వారా ఇప్పటివరకు చేపట్టిన సీఎస్ఆర్ కార్యక్రమాల వివరాలను వెల్లడించగా, భవిష్యత్తులో చేపట్టనున్న పనులపై చర్చించారు.ఈ సమావేశం లో సి పి ఓ సంజీవరావు,సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

## పత్తి,మొక్కజొన్నకు బదులుగా ప్రత్యామ్నాయంగా వేరే పంటలు సాగుపై దృష్టి పెట్టాలి



**టేకులపల్లి, జూన్ 15, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల పరిధిలోని కొత్త తండా (పి) గ్రామంలో సోమవారం ఇల్లందు వ్యవసాయ సహాయ సంచాలకులు లాల్చంద్ రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.తక్కువ వర్షపాతం ఉన్న పరిస్థితుల్లో పత్తి,మొక్కజొన్న పంటకు బదులుగా పెసర, కంది, కూరగాయలు, నువ్వులు, పామ్ ఆయిల్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున, 60 నుంచి 70 మిల్లీమీటర్ల మేర సరిపడా వర్షపాతం కురిసే వరకు పొడి దుక్కిలో విత్తనాలు విత్తవద్దని హెచ్చరించారు. వరి సాగు చేసే రైతులు ప్రభుత్వం సూచించిన బీపీటీ–5204, హెచ్ఎంటీ, తెలంగాణ సోనా, కేఎన్ఎం–1638, డబ్ల్యూజీఎల్–44, జేజీఎల్–1798, డబ్ల్యూజీఎల్–962 రకాలనే సాగు చేయాలని సూచించారు. అనంత రం గ్రామంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేసి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యాపారులకు సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగు చేపట్టాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎవో అన్నపూర్ణ, ఏఈవోలు పాల్గొన్నారు.

# గౌరవం ఎక్కడ...?

- సర్పంచ్‌లకు అందని గౌరవ వేతనం
- ఐదు నెలలుగా ఎదురు చూపులే...
- బకాయిల భారంతో సతమతమవుతున్న గ్రామ పాలకులు
- జిల్లాలో 479 మంది సర్పంచ్‌లకు రూ.1.55 కోట్లకు పైగా పెండింగ్
- గ్రామాభివృద్ధికి ముందుండే ప్రజాప్రతినిధులే ఆర్థిక ఇబ్బందుల్లో



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 15 (ప్రజా జ్యోతి):** పెద్దదిక్కుగా నిలిచే సర్పంచ్... ప్రజల సమస్యలకు తొలి స్పందనగా ఉండే ప్రజాప్రతినిధి... అభివృద్ధి పనులకు ముందు వరుసలో నడిచే నాయకుడు. కానీ నేడు అదే సర్పంచ్ తనకు రావాల్సిన గౌరవ వేతనం కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న సర్పంచ్‌లకు ఐదు నెలలుగా గౌరవ వేతనాలు అందకపోవడంతో జిల్లావ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 479 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు గత ఐదు నెలలుగా గౌరవ వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. నెలకు ఒక్కొక్కరికి రూ.6,500 చొప్పున చెల్లించాల్సిన వేతనాలు నిలిచిపోవడంతో సుమారు రూ.1.55 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. గ్రామ ప్రజల సమస్యలను భుజాన వేసుకుని తిరిగే సర్పంచ్‌లు నేడు తమ హక్కైన గౌరవ వేతనం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› గ్రామాభివృద్ధికి కష్టాలు... గౌరవ వేతనానికి ఎదురు చూపులు

గ్రామంలో రోడ్డు పాడైనా, వీధి దీపం వెలగకపోయినా, తాగునీటి సమస్య వచ్చినా ప్రజలు ముందుగా ఆశ్రయించేది సర్పంచ్‌నే. ప్రభుత్వ పథకాల అమలు నుంచి అభివృద్ధి పనుల వరకు గ్రామ పాలనలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న సర్పంచ్‌లు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గ్రామ ప్రజల అవసరాల కోసం తమ సొంత ఖర్చులతో తిరుగుతూ, అధికారులతో సమన్వయం చేస్తూ, ఎన్నో సందర్భాల్లో వ్యక్తిగతంగా అప్పులు చేసి పనులు పూర్తి చేస్తున్న సర్పంచ్‌లు, కనీస గౌరవ వేతనం కూడా అందకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ››› బకాయిల భారం... పెరుగుతున్న అసంతృప్తి

జిల్లాలోని 479 గ్రామపంచాయతీలకు సంబంధించిన గౌరవ వేతనాలు నిలిచిపోవడంతో సర్పంచ్‌లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధుల కొరత, పెండింగ్ బిల్లులు, నిర్వహణ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో గౌరవ వేతనాలు కూడా అందకపోవడం వారిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టిందని పలువురు పేర్కొంటున్నారు. "ప్రజలకు సేవ చేయడం మా బాధ్యతే. కానీ కుటుంబ అవసరాలు, ప్రయాణ ఖర్చులు, కార్యాలయ నిర్వహణ వంటి వాటికి కనీస ఆదాయం కూడా లేకపోవడం బాధాకరం" అని పలువురు సర్పంచ్‌లు వాపోతున్నారు.

### ››› గ్రామ స్వరాజ్యానికి బలమైన స్తంభాలే సర్పంచ్‌లు

రాజ్యాంగం కల్పించిన స్థానిక స్వపరిపాలన వ్యవస్థలో గ్రామపంచాయతీలు కీలక భాగం. గ్రామ స్వరాజ్యానికి ప్రతీకలుగా నిలిచే సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. అలాంటి ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాల చెల్లింపులో జాప్యం జరగడం గ్రామీణ పాలనపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని, వారి సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధుల సంఘాలు కోరుతున్నాయి.


### ››› వెంటనే విడుదల చేయాలని డిమాండ్

ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని జిల్లాలోని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సేవలకు తమ వంతు కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు రావాల్సిన గౌరవాన్ని నిలబెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "గ్రామానికి సేవ చేస్తున్న చేతులకు గౌరవం దక్కాలి... గౌరవ వేతనం సమయానికి చేరాలి" అని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో గౌరవ వేతనాల అంశం గ్రామపంచాయతీల్లో చర్చనీయాంశంగా మారింది. గౌరవం పేరుతో ఇచ్చే వేతనం ఐదు నెలలుగా అందకపోవడం సర్పంచ్‌ల ఆవేదనకు కారణమవుతోంది.

## కొడుకు, కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు 85 ఏళ్ల వృద్ధురాలి ఫిర్యాదు





**పాల్వంచ, జూన్ 15, ప్రజాజ్యోతి:** కొడుకు, కోడలు వేధింపుల నుంచి తనకు రక్షణ కల్పించడంతో పాటు, తన ఆస్తి, వ్యవసాయ భూమిని తిరిగి ఇప్పించాలని 85 ఏళ్ల వృద్ధురాలు జిల్లా కలెక్టర్ అంకిత్‌ను ఆశ్రయించారు.కొత్తగూడెం–పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 34వ డివిజన్ కరకవాగు గ్రామానికి చెందిన భట్టు కోమి సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, వారిలో పెద్ద కుమారుడు భట్టు రామ్ దాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. తనను బాగా చూసుకుంటానని నమ్మబలికి ఇంటి స్థలం, నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలపై సంతకాలు తీసుకున్నాడని ఆరోపించారు.ఆ తరువాత తనకు సరైన భోజనం కూడా పెట్టకుండా వేధింపులకు గురిచేస్తూ, దుర్భాషలాడడంతో పాటు శారీరకంగా దాడి చేస్తున్నారని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ డబ్బులను కూడా తీసుకుంటున్నారని కన్నీటి పర్యంతమయ్యారు.తన భూమి, ఆస్తులు, పింఛన్ డబ్బులు తిరిగి ఇప్పించి, కొడుకు–కోడలు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఆమె కలెక్టర్‌ను వేడుకున్నారు.ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ అంకిత్, విషయాన్ని వెంటనే విచారించి సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



**ములకలపల్లి, జూన్ 15,(ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని రాజుపేటలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి పాల్గోని మాట్లాడారు., ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధికి ఎలాంటి ఆటంకం కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్రాన్ని పురోగతి దిశగా నడిపిస్తున్నారని అన్నారు. భట్టి విక్రమార్క భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యండి జహీరుద్దీన్, ములకలపల్లి సర్పంచ్ కొర్సా చంద్రలేఖ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కరుటూరి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గాడి తిరుపతిరెడ్డి, సురభి రాజేష్, శనగపాటి రవి, నల్లమోతు జగదీష్, గ్రామ కమిటీ అధ్యక్షులు అనంతుల సత్యనారాయణ, గంట వెంకటేశ్వర్లు, సాదం శ్రీనివాస్, కొర్సా ప్రసాద్, ములకలపల్లి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, యువజన కాంగ్రెస్ నాయకులు గుంట్రు కృష్ణ, వెలకం వెంకటేష్, పాలకుర్తి దివాకర్, రాచన్నగూడెం సోషల్ మీడియా అధ్యక్షుడు బైటి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధమైన పొలాలు... ముఖం చాటేసిన వర్షాలు!

- తొలి వానల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాతలు
- దుక్కులు దున్ని, విత్తనాలు సిద్ధం చేసినా ముందుకు సాగని సాగు
- ఆలస్యమవుతున్న నైరుతి రుతుపవనాలతో రైతుల్లో పెరుగుతున్న ఆందోళన
- భద్రాద్రి జిల్లాలో వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ప్రభావం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

**"రైతు కళ్లలో ఆశ... ఆకాశంలో మేఘాల కోసం ఎదురుచూపు" అన్న పరిస్థితి ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కనిపిస్తోంది. వానాకాలం ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగుకు సిద్ధమైన పొలాలు వర్షపు చినుకుల కోసం ఎదురు చూస్తుండగా, రైతుల ఆశలు మాత్రం ఆకాశానికే పరిమితమవుతున్నాయి.**

నైరుతి రుతుపవనాల ప్రభావం మందగించడంతో జిల్లాలో వ్యవసాయ కార్యకలాపాలు ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు.

### ››› సిద్ధమైన పొలాలు... మొదలుకాని సాగు

జిల్లాలోని భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పాల్వంచ, దమ్మపేట, చర్ల, వెంకటాపురం, ములకలపల్లి తదితర మండలాల్లో రైతులు ఇప్పటికే పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేశారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో విత్తనాలు వేయాలా? ఇంకొన్ని రోజులు వేచి చూడాలా? అనే సందిగ్ధంలో ఉన్నారు. ప్రత్యేకించి వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, సోయాబీన్ సాగు చేసే రైతులు వర్షాల ఆలస్యంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

### ››› అప్పులు చేసి పెట్టుబడులు... చేతిలో ఆందోళన

ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశారు. ట్రాక్టర్లతో దుక్కులు దున్నించి పొలాలను సిద్ధం చేశారు. కానీ వర్షాలు కురవకపోవడంతో పెట్టుబడులు పెట్టిన రైతులు ఆందోళనలో ఉన్నారు. "పొలం సిద్ధంగా ఉంది... విత్తనం సిద్ధంగా ఉంది... కానీ వాన మాత్రం రావడం లేదు" అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజులు వర్షాలు ఆలస్యమైతే సాగు కాలం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

### ››› చెరువుల్లో నీటి నిల్వలు ఆందోళనకరం

జిల్లాలోని అనేక చెరువులు, కుంటలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. గత వేసవిలో తీవ్ర ఎండల కారణంగా నీటి మట్టాలు పడిపోవడంతో ప్రస్తుతం సాగునీటి పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాల పునరుద్ధరణ కూడా జరగడం లేదు. ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన మండలాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది.

### ››› నైరుతి రుతుపవనాల కోసం ఎదురుచూపు

సాధారణంగా జూన్ మొదటి లేదా రెండో వారంలో జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి. కానీ ఈసారి నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో చురుకుగా లేకపోవడంతో వర్షాలు ఆలస్యమవుతున్నాయి. దీంతో రైతులు ప్రతిరోజూ వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ఆశగా ఎదురుచూస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, రైతులు మాత్రం త్వరగా వర్షాలు కురవాలని కోరుకుంటున్నారు.

### ››› వ్యవసాయ శాఖ అప్రమత్తం

ప్రస్తుత పరిస్థితులను వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారు. రైతులు తొందరపడి విత్తనాలు వేయకుండా స్థానిక వాతావరణ పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. వర్షాలు స్థిరంగా కురిసిన తర్వాతే పూర్తి స్థాయి విత్తనాలు వేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

### ››› మేఘాల కోసం ఎదురు చూపు

ఒకవైపు ఎండల తీవ్రత, మరోవైపు ఆలస్యమవుతున్న వర్షాలు... ఈ రెండు కారణాలతో జిల్లాలోని రైతాంగం ఆందోళనలో ఉంది. పొలాలు సిద్ధంగా ఉన్నాయి...నాగళ్లు సిద్ధంగా ఉన్నాయి... విత్తనాలు గోదాముల్లో సిద్ధంగా ఉన్నాయి... కానీ ప్రకృతి కరుణ కోసం రైతు కళ్లు మాత్రం ఇంకా ఆకాశం వైపే చూస్తున్నాయి. వాన చినుకులు పడితేనే పొలాల్లో పచ్చదనం పరుస్తుంది... రైతు ముఖంలో చిరునవ్వు వికసిస్తుంది. అప్పటి వరకు భద్రాద్రి జిల్లాలో అన్నదాతల నిరీక్షణ కొనసాగుతూనే ఉండనుంది.





## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఎంఈఓలదే

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జోన్ 15,(ప్రజాజ్యోతి)** జిల్లాలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా మండల విద్యాశాఖ అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, బడిబాట కార్యక్రమం, ఏకరూప దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాల పంపిణీ, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, ఆధార్ అప్‌డేషన్, అపార్ నమోదు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమం కింద జిల్లాకు నిర్దేశించిన 60,415 మంది విద్యార్థుల చేరికల లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను పెంచేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం జీరో ఎన్‌రోల్మెంట్ ఉన్న 10 ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత ఎంఈఓలు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఆయా పాఠశాలల్లో తిరిగి విద్యార్థుల చేరికలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను (కేజీబీవీలు) ఎంఈఓలు క్రమం తప్పకుండా సందర్శించి, చేరికల పెంపు కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి విద్యార్థులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఎంఈఓలదేనని స్పష్టం చేసిన కలెక్టర్, విద్యా ప్రమాణాల పెంపునకు వారు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో బోధన, హాజరు, విద్యార్థుల అభ్యాస స్థాయిలపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డి ఈ ఓ శంభు ప్రసాద్, విద్యాశాఖ కోఆర్డినేటర్లు, సతీష్, నాగశేకర శర్మ విద్యా శాఖ అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ బిల్డింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని వినతి



**ఇల్లందు, జూన్ 15 (ప్రజాజ్యోతి)** మండలంలోని విజయలక్ష్మి నగర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సోమవారం సర్పంచ్ చందావత్ రమేష్ బాబు ఐటీడీఏ ఏపిఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలో సీసీ రోడ్డు నిర్మాణం, క్వార్టర్స్ ఏరియాలో గృహలక్ష్మి పథకం వర్తింపు, స్కూల్ బిల్డింగ్ మంజూరు కలెక్టర్ కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీకి ఐటిఐ నిధుల ద్వారా మంజూరైన పంచాయతీ బిల్డింగ్ ఇప్పటివరకు నిర్మాణం పూర్తి కాలేదని, త్వరితగతిన గ్రామపంచాయతీ కార్యాలయం పూర్తిచేయాలని, నిధులు మంజూరు చేయాలని కోరారు. అద్దె భవనంలో గ్రామపంచాయతీ కార్యకలాలు పలు నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం పాలక వర్గ సమావేశం కూడా నిర్వహించుకోవాలంటే సరైన సదుపాయాలు లేవని ఎండాకాలంలో రేకుల షెడ్డు కింద కూర్చోలేక చెట్ల కింద కూర్చుని పరిపాలన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. స్పందించిన ఏపిఓ సంబంధిత అధికారులను ఇప్పటివరకు ఉన్న రిపోర్ట్ తీసుకొని త్వరతగతిన పనులు పూర్తి చేసేలా చూస్తానని తెలిపినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.